


ప్రశాంతంగా నేషనల్ మీన్స్ కమ్ స్కాలర్‌షిప్ పరీక్ష

నిజామాబాద్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ స్కాలర్‌షిప్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తొమ్మిది పరీక్షా కేంద్రాలను నిర్వహించిన పరీక్షకు మొత్తం 1861 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1785 మంది హాజరుకాగా 76 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని హరిచరణ్ హిందీ విద్యాలయం, రవి పబ్లిక్ స్కూల్ సెంటర్లను జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగినట్లు ఆయన తెలిపారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మెదక్ డీఈవో రాధాకృష్ణన్

రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్

చాంపియన్‌గా జిల్లా జట్టు

- మెదక్ జట్టుపై జిల్లా జట్టు ఘన విజయం
- అభినందించిన సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌గా జిల్లా బాలుర జట్టు నిలిచింది. నవంబరు 23 నుంచి 24 వరకు మెదక్ జిల్లా మాసాయిపేటలో జరిగిన 9వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలో జిల్లా బాలుర జట్టు ఫైనల్ మ్యాచ్‌లో మెదక్ జట్టుపై తలపడి 7-1 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణన్ హాజరై జిల్లా జట్టుకు ట్రోఫీ, బంగారు పతకాలు అందజేశారు. రాష్ట్ర ఉత్తమ పిక్చర్ రోహిత్ ప్రత్యేక బహుమతిని రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులు శోభన్ బాబు, అభిషేక్‌గౌడ్‌లు పతకాలను అందజేశారు. జిల్లా జట్టు ట్రోఫీ సాధించడం పట్ల సాఫ్ట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ నీరజ్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు.

రోజురోజుకూ తగ్గుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

- కోటగిరిలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- నిజామాబాద్‌లో 12.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



నిజామాబాద్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. చలి తీవ్రతతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒక్కసారిగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావడం లేదు. సాయంత్రం 6 దాటితే చాలు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. సాయంత్రం సమయాల్లో ప్రజలు బయటకు రాకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. చలి తీవ్రతను తట్టుకునేందుకు ప్రజలు చలిమంటలు, ఉన్ని దుస్తులు, రూమ్ హీటర్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఆదివారం కోటగిరిలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా నగరంలోని గూపన్‌పల్లిలో 12.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాలూరా, పాల్దాలో 13.1, తూంపల్లిలో 13.2, చీమన్‌పల్లిలో 13.3, పోతంగల్‌లో 13.4, బెల్లాల్‌లో 13.5, నిజామాబాద్, రుద్రూర్‌లలో 13.6, వేల్పూర్‌లో 13.7, నవీపేట, ఏర్గట్లలో 13.9, ఎడపల్లిలో 14 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.



కొనుగోలు కేంద్రాలకే

రైతుల మొగ్గు

బోనస్ చెల్లింపుతో ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తున్న రైతులు

- సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మేందుకు మొగ్గు చూపుతున్న జిల్లా రైతులు
- జిల్లాలో ఇప్పటి వరకు 3. 95 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిన అధికారులు
- రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న బోనస్ డబ్బులు

నిజామాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతులు కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం ధాన్యం అమ్మేందుకే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఎక్కువ మంది రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకు వస్తున్నారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద ఉండి అమ్మకాలను చేస్తున్నారు. జిల్లాలో సన్న, దొడ్డు రకాలను కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నాలకు ధర పెరుగుతున్న మద్దతు ధరతో పాటు బోనస్ ఎక్కువగా వస్తుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలను చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సేకరించిన ధాన్యంలో 70 శాతం వరకు సన్నర కాలను రైతుల నుంచి తీసుకున్నారు. దొడ్డు రకాలను ఎక్కువ మంది రైతులు ముందుగానే వ్యాపారులకు అమ్మకాలు చేశారు. ప్రభుత్వం సన్నరకాలకు క్వింటా లుకు 500 రూపాయల బోనస్ అందిస్తుండటంతో ఆలస్యమైనా కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలను చేస్తున్నారు.

670 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో గడిచిన నెలరోజులుగా ధాన్యం కొనుగోళ్లను చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 670 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సన్నరకాలతో పాటు దొడ్డు రకాలకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొంటున్నారు. కొన్న ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలిస్తున్నారు. రైతులు అమ్మిన ధాన్యం ప్రకారం వారి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3.95లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలో కొనుగోలు చేశారు. జిల్లాలోని మెజార్టీ గ్రామాల పరిధిలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. సన్నరకాలతో పాటు దొడ్డు రకాలను మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాలు 2320 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యంలో 2.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్నరకాలను కొనుగోలు చేశారు. 1.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డురకాలను కొన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం వానాకాలంలో 4లక్షల 29వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. దీనిలో సన్నరకాలు 3లక్షల 40వేల ఎకరాల్లో సాగు చేశారు. బోధన్ డివిజన్ పరిధిలో లక్ష ఎకరాల వరకు రైతులు సన్నరకాలను వేశారు. ఈ ప్రాంతంలోని రైతులు ముందుగానే వ్యాపారులకు అమ్మకాలు చేశారు. అక్టోబర్ ఆరంభం నుంచే వరికోతలు చేసిన రైతులు వ్యాపారులకు అమ్మకాలను చేశారు. మద్దతు ధరకు మించి కొంత మంది రైతులు అమ్మకాలు చేయగా మరికొంత మంది రైతులు పచ్చిధాన్యాన్నే మద్దతు ధరకు పొలాల వద్దనే అమ్మకాలు చేశారు. గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించారు. సన్నరకాలు వేసిన రైతులకు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీలో భాగంగా ఎక్కువ మంది రైతులు ఈ సన్నాలను సాగు చేశారు. బోధన్ డివిజన్‌లోని కొన్ని మండలాలు మినహాయిస్తే మిగతా మండలాల పరిధిలోని రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు చేస్తున్నారు. వరికోతలు మొదలు పెట్టి నెలన్నర దాటిన రైతులు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూశారు. కేంద్రాలు ఏర్పాటు చేయగానే సన్నరకం ధాన్యాన్ని అమ్మకాలు చేస్తున్నారు. కొంత మంది రైతులు దొడ్డురకం ధాన్యాన్ని ముందస్తుగానే వ్యాపారులకు అమ్మకాలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే ధాన్యానికి ఎక్కువగా డబ్బులు వస్తుండటం, మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుండటంతో రైతులు రోజుల తరబడి వేచిచూసి ఈ అమ్మకాలను చేస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 7లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 4లక్షల మెట్రిక్ టన్నులలోపు ధాన్యం సేకరించగా మిగతా ధాన్యాన్ని డిసెంబర్ మొదటి వారంలోపు సేకరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం ధాన్యంలో 5లక్షల మెట్రిక్ టన్నుల వరకు సన్నరకం ధాన్యమే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రైతుల ఖాతాల్లో రూ.450 కోట్లు జమ

జిల్లాలో ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో 450 కోట్ల రూపాయలు జమ చేశారు. వీటితో పాటు బోనస్‌ను కూడా రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 9766 మంది రైతుల ఖాతాల్లో 39.13 కోట్ల రూపాయలను జమ చేశారు. పౌరసరఫరాల సంస్థ నుంచి రైతులు అమ్మిన ధాన్యం వివరాల ఆధారంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ బోనస్‌ను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. బోనస్ పంపిణీ ప్రారంభం కావడంతో ఎక్కువ మంది రైతులు కూడా కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మేందుకు చొరవ చూపుతున్నారు. జిల్లాలో ఎక్కువ మంది రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే సన్నరకాలను అమ్మకాలు చేస్తున్నారని పౌరసరఫరాల శాఖల అధికారులు అంబదాస్ రాజేశ్వర్, అర్వింద రెడ్డిలు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లతో పాటు రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నామన్నారు. సన్నరకం అమ్మిన రైతులకు బోనస్‌ను కూడా వారి ఖాతాల్లో వేస్తున్నామని తెలిపారు.



నిరాశలో.. నైజాం నాటి నిజాంసాగర్!

- ఉమ్మడి జిల్లాలో ఏకైక నవోదయ పాఠశాల నిజాంసాగర్‌లోనే..
- ఏళ్లు గడిచినా.. ఒక్క రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం ఏర్పాటు
- ఎన్నికల హామీలకే పరిమితమవుతున్న నిజాంసాగర్ విద్య హబ్
- పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా నిజాంసాగర్ పరిస్థితి

మూలనపడ్డ మినీ కలెక్టరేట్!

- నాడు చరిత్ర ఘనం.. నేడు అధ్వానం
- మినీ కలెక్టరేట్‌గా బాసిల్లిన డిచ్‌పల్లిలోని టీటీడీసీ మూసివేత
- తిరిగి తెరిపించాలని మహిళా సమాఖ్య సంఘాల డిమాండ్

7



'రియల్' ధమాల్

- తగ్గిన ధరలతో పడిపోయిన భూముల క్రయవిక్రయాలు
- కొంప ముంచిన నాన్‌లే ఔట్
- లబోదిబోమంటున్న బాధితులు

ఖిల్లా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొంత కాలంగా భూముల క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిపోయింది. గత రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ ద్వారా జీ-2/ 257/ 2019 మెమో జారీ చేయడం వల్ల అమ్మకాలు నిలచిపోయాయి. నాన్ లే ఔట్ భూములకు రిజిస్ట్రేషన్లు చేయరాదని ఆదేశాలు జారీ చేసింది. దీంతో నాన్ లేఔట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలచిపోయాయి. దీంతో సమయానికి ప్లాట్లను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయల్లో పలికిన భూమి విలువ సగానికి సగం పడిపోవడంతో వెంచర్లలో పెట్టుబడి పెటిన వారు లబోదిబోమంటున్నారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 ప్రకారం జీవోకు బదులు ప్రభుత్వాలు సంబంధిత శాఖ అధికారిచే మెమో జారీ చేయించిన రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని ఉన్నప్పటికీ అధికారులు మాత్రం మెమోను అడ్డం పెట్టుకుని రిజిస్ట్రేషన్లు చేయడం లేదు.

2020లో లాక్‌డౌన్..

2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలు చేయడం వల్ల అన్ని వ్యాపారాలతో పాటు భూముల క్రయవిక్రయాలు స్థంభించిపోయాయి. సుమారు మూడేళ్లుగా వెంచర్ల విక్రయాలు జరగలేదు. అలాగే గత రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్ విధానాన్ని అమలు చేసింది. నాన్‌లేఔట్ ప్లాట్లు స్కీమ్‌లో కొనుగోలు చేసిన వారు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. దీంతో చాల మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయినా ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరగలేదు.

నిలిచిన నాన్ లేఔట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు..

గత కొన్ని ఏళ్లుగా వెంచర్లు వేసిన వారు వెంచర్లకు నిబంధనలు పాటించక లేఔట్ ప్లాట్లు వేయకపోవడం వల్ల కొనుగోలు చేసిన వారు వాటిని అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. తమ వద్ద ఉన్న డబ్బుతో సమయానికి అవసరమవుతుందని భావించి ప్లాట్లలో పెట్టుబడులు పెట్టారు. కానీ నాన్ లేఔట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలచిపోవడంతో వాటిని సమయానికి అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

తగ్గిన ఆదాయం..

గత ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండిపడింది. ప్రతి రోజూ వందల సంఖ్యలో కావాల్సిన రిజిస్ట్రేషన్లు నిబంధనలు అడ్డురావడంతో తగ్గిపోయాయి.

నాన్‌లేఔట్ విధానాన్ని ఎత్తివేయాలి..

అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా నాన్‌లేఔట్ విధానాన్ని ఎత్తివేసి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కొనసాగిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా దాని ఊసే లేదని రియల్ ఎస్టేట్ ప్రతినిధులు వాపోతున్నారు. అప్పులు తీసుకొచ్చి వెంచర్లు వేసి నష్టాలపాల వ ు త ు న్నా వ ు ని పేర్కొంటున్నారు.

5న జిల్లా స్థాయి

ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి ఆదేశానుసారం డిసెంబరు 5 నుంచి 7వ తేదీ వరకు జిల్లాస్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఈ ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను 126 ఇన్‌స్పైర్ అవార్డులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ న్యూ ఢిల్లీవారు విద్యార్థులకు అందజేయడం జరిగిందన్నారు. వారి అకౌంట్‌లలో 10వేల రూపాయలు గత మార్చి నెలలోనే జమయ్యాయని సంబంధిత గైడ్ టీచర్లు తమ విద్యార్థి చేత ప్రదర్శనను తయారు చేసి వాటిని జిల్లా స్థాయిలో ప్రదర్శించేలా ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతీ ప్రదర్శన గతంలో ఇచ్చిన టైటిల్ ఆధారంగా తయారు చేయాలని, జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కూడా ఏకకాలంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండు ప్రదర్శనల కోసం గూగుల్ ఫామ్‌ను ఈనెల 30లోపు నింపాలని డిసెంబరు 5న మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు గైడ్ టీచర్ తమ విద్యార్థితో పాటు రిజిస్ట్రేషన్ ఫామ్, ప్రదర్శన తీసుకొని వచ్చి వారికి కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. 6వ తేదీ ఉదయం 9గంటల నుంచి ప్రదర్శన పోటీలను న్యాయ నిర్ణేతలు సందర్శించి ఉత్తతమైన వాటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. సుస్థిర భవిష్యత్తు, ఆరోగ్యం కోసం చిరు ధాన్యాలు అనే అంశంను సెమినార్ పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ 9848219365 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

ఆర్మూర్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షించాలని సదానందగిరి యోగి మహరాజ్ అన్నారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని సిద్దులగుట్టపై సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాక్షేత్రం వద్ద ధ్యాన జ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్ఞానదాతగా హాజరైన సదానందగిరియోగి మహరాజ్ మాట్లాడుతూ.. పిరమిడ్ ధ్యాన మందిరంలో ప్రతీరోజు ధ్యానం చేసి జ్ఞానాన్ని, శక్తిని పొందాలన్నారు. సిద్దులగుట్టపై ఆహ్లాదకర వాతావరణంలో ధ్యాన మందిర నిర్మించడం గొప్ప విషయమన్నారు. కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ధాన్యం చేసి జ్ఞానం పొందాలని, శాఖాహారం భుజించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి, సిద్దేశ్వర పిరమిడ్ చైర్మన్ తిరుమల గంగారాం పాల్గొన్నారు.



యోగి మహరాజ్‌కు ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

ఓటరు నమోదుకు గడువు పెంపు

- గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు డిసెంబరు తొమ్మిది వరకు గడువు పెంచిన కేంద్ర ఎన్నికల కమిషన్
- పోటీపడి ఓటరు నమోదుకు నేతల ప్రయత్నం
- ఎన్నికల కోసం మద్దతును కూడగడుతున్న ఆశావహుల

నిజామాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ఎన్నికల కమిషన్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు గడువు పెంచడంతో ఆశావహులు మళ్లీ ప్రయత్నాలను చేస్తున్నారు. నిర్ణీత గడువులోపు మరింత మందిని నమోదు చేయించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో నెలరోజులకు పైగా గడువు ఇవ్వడంతో పోటీపడి ఓటరు నమోదు చేయించిన వారు మళ్లీ అదే రీతిలో గ్రాడ్యుయేట్‌లను గుర్తించడంతో పాటు ఇచ్చిన పదిహేను రోజుల గడువులో మరింత మందిని చేర్పించేందుకు సిద్ధమవుతున్నారు. తమ బృందం సభ్యులను రంగం లోకి దించడంతో పాటు గ్రాడ్యుయేట్‌ల వివరాలను సేకరిస్తున్నారు. ఏరోజుకు ఆరోజు వారి వివరాలను నమోదు చేస్తున్నారు. వచ్చే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి పోటీపడే వారితో పాటు స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీకి సన్నద్ధమవుతున్న ఉద్యోగులు కూడా తమవంతు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ప్రధాన పార్టీ నేతలను కలుస్తూనే తమ అనుచరి వర్గంతో ఓటరు నమోదు చేపడుతూ నిర్ణీత సమయంలో సమావేశాలను నిర్వహిస్తూ గ్రాడ్యుయేట్ ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు.

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పదవీకాలం వచ్చే మార్చినెల 29తో పూర్తవుతుంది. ఆలోపు కేంద్ర ఎన్నికల కమీషన్ ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి ఎన్నికలు నిర్వహించనుంది. దానిలోని భాగంగానే గత అక్టోబర్ నెల నుంచి నవంబర్ 5 వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. అన్ని మండలాల పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసేందుకు ఏర్పాట్లను చేసింది. తహసీల్దార్ కార్యాలయాల్లో కావాల్సిన పత్రాలను ఉంచడంతో పాటు ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆలోపు చేసుకున్న వారందరూ దరఖాస్తులను పరిశీలించడంతో పాటు ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో అర్హులైన గ్రాడ్యుయేట్‌లందరికి ఓటరుగా అవకాశం కల్పించారు. ఈనెల 23న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. జిల్లాలో ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మొత్తం 27110 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వీరిలో పురుష అభ్యర్థులు 17,237 మంది ఉండగా, మహిళా అభ్యర్థులు 9873 మంది ఉన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం మొత్తం 3199 మంది ఓటర్లు ఉన్నట్లు ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించారు. వీరిలో పురుష ఓటర్లు 1947 మంది, మహిళా అభ్యర్థులు 1252 మంది ఉన్నట్లు ప్రకటించారు. ఈ ఎన్నికల కోసం మరింత అవకాశాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ కల్పించింది. వివిధ సంఘాల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు మరో 15 రోజులు ఓటరు నమోదుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో డిసెంబర్ 9 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు గ్రాడ్యుయేట్‌లకు అవకాశం కల్పించింది. మరో 15రోజుల పాటు కేంద్ర ఎన్నికల కమిషన్ అవకాశం ఇవ్వడంతో పోటా పోటీగా గ్రాడ్యుయేట్‌ల వివరాలను తీసుకోవడంతో పాటు ఓటరుగా నమోదు చేసేందుకు ఆశావాహులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో తమ వర్గం వారిని నమోదు చేసుకుంటే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసి వస్తుందని భావిస్తున్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయండి



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

ఇందల్వాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించతలపెట్టిన మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఇందల్వాయి మాలమహానాడు నాయకులు తెలిపారు. మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఆదివారం మాల సింహగర్జన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు పాశం కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీల రిజర్వేషన్లను పెంచాలని మాలలు కోరితే ఎస్సీల మధ్య వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడగొట్టడం నీచమైన చర్య అని ప్రభుత్వంపై మండిపడ్డారు. డిసెంబర్ 1న ఆదివారం రోజున హైదరాబాద్‌లో నిర్వహించే మాల సింహగర్జన సభకు అన్ని గ్రామాల నుంచి మాలలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. అనంతరం గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నీరడి మనోహర్, వంశీకృష్ణ, నీరడి గంగాధర్, నర్సయ్య, బుచ్చన్న, రంజిత్, గంగాధర్, మన్నె యాదయ్య, శివ, ఆనది మురళి, మూలుగు లింగం తదితరులు పాల్గొన్నారు.

● మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

రెంజల్: డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మాలల సింహగర్జనకు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి పిలుపునిచ్చారు. ఆదివారం రెంజల్ మండల కేంద్రంతో పాటు తాడ్‌బిలోలి, బోర్గాం, నీలా, పేపర్‌మిల్ గ్రామాలలో మాల మహనాడు నాయకులతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మాల మహనాడు ఆధ్వర్యంలో డిసెంబర్ 1న తలపెట్టిన ఛలో హైదరాబాద్ మాలల సింహగర్జనకు తరలివచ్చి మాలల సత్తా చూపించాలన్నారు. మాలలను ఐక్యం చేస్తూ హలో మాల, ఛలో హైదరాబాద్ పేరిట వాల్ పోస్టర్ల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సిద్ద ప్రభాకర్, యూత్ ఉపాధ్యక్షులు గైని కిరణ్, మండల అధ్యక్షులు అబ్బోల్ల శ్రీకాంత్, నీరడి ప్రసాద్, లోక కృష్ణ, గంగాధర్, సాయిలు, నాగరాజు, క్రాంతికుమార్, శంకర్, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

హరిదా మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఘనపురం దేవేందర్

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హరిదా రచయితల 6వ మహాసభలను విజయవంతం చేయాలని హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 4వ తేదీన జిల్లా కేంద్రంలోని నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో సాయంత్రం 5గంటలకు మహాసభలు ప్రారంభమవుతాయని అన్నారు. ప్రముఖ కవి విమర్శకుడు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డికి సరస్వతీరాజ్ తెలంగాణ విశిష్ట సాహిత్య పురస్కారాన్ని మహాసభలో ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా సాహితీరంగంలో కృషి చేసిన వారికి సరస్వతీరాజ్ అవార్డు ప్రధానం చేయడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ఈ మహాసభల సందర్భంగా రాష్ట్రస్థాయి కవిసమ్మేళనం నిర్వహిస్తున్నామని ఔత్సాహిక కవులు ఈనెల 29లోగా తమ పేర్లను 8897213286, 8374002227 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరిదా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి నరేష్‌రావు, కోశాధికారి గంట్యాల ప్రసాద్, అధికార ప్రతినిధి నరాల సుధాకర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆర్య, సీనియర్ కవి పంచరెడ్డి లక్ష్మణ్, శంకర్, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

మోపాల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి):రైతు, రైతుకూలీల సమస్యలు పరిష్కారంకై ఈనెల 26న జరిగే ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రగతీశీల రైతుకూలీ సంఘం ప్రధానకార్యదర్శి సాయగౌడ్, కార్యదర్శి గంగమల్లులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ, ధర్నాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు, రైతుకూలీలకు సంవత్సరానికి 12వేలు, జీవన భృతి, పంటలకు గిట్టుబాటు ధర, వరిక్వింటాలుకు 500లబోనస్, రైతులకు ఎలాంటి షరతులు లేకుండా 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు సబ్సీడీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, అనుబంధం చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నారయణ, వెంకట్, ఎర్రన్న, దండు నర్సయ్య, గంగారాం, దండుమహేష్, ఎల్లయ్య, సాయిలు, గంగారం తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలి

ముప్కాల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ హాస్టళ్లలో మెను ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఎంఈవో బట్టు రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం బాల్కొండ మండలంలోని వివిధ ప్రభుత్వ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ గురుకుల హాస్టళ్లలో భోజనం కలుషితం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలకు పునరావృతం కాకుండా చూడాలని బాల్కొండ విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ పరిశీలించారు. బాలుర హాస్టల్, కస్తూర్బ బాలిక వసతిగృహాన్ని, తెలంగాణ మోడల్ వసతిగృహాన్ని ఆయన తనిఖీ చేశారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో వంట మనిషి వంట సరిగ్గా చేయడంలేదని విద్యార్థులు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్తానన్నారు. చాలితీవ్రత అధికమవుతున్న దృష్ట్యా విద్యార్థులు చలినీళ్లలో స్నానం చేయడం వల్ల జ్వరాలు వస్తున్నట్టు తెలిపారు. వేడి నీళ్ల కోసం గ్రీజర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కిటికిలకు జాలి లేకపోవడంతో దోమలు అధికంగా వస్తున్నాయని, హాస్టల్‌లో బియ్యంను, ఇతర వంట సరుకులు నిల్వ చేసే విధానాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వేల్ఫూర్ ఆఫీసర్ గంగాకిషన్, కస్తూర్బ పాఠశాలలో సుజాత, మోడల్ స్కూల్ హాస్టల్‌లో వార్డెన్, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీల్లో వేల్పూర్ వాసికి గోల్డ్‌మెడల్



అశోక్‌కు గోల్డ్‌మెడల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

వేల్పూర్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి పది కిలోమీటర్ల పరుగు పందెంలో వేల్పూర్‌కు చెందిన గుగ్గిలం అశోక్ గోల్డ్‌మెడల్ సాధించారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ యువకులు గుగ్గిలం అశోక్‌ను ఆదర్శం గా తీసుకొని పరుగు పందెంలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా మోహన్‌దాస్ చేతుల మీదగా అశోక్‌కు గోల్డ్‌మెడల్ సర్టిఫికెట్‌ను అందజేశారు. అశోక్ ప్రస్తుతం కామారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న ఆర్టీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్‌లలో పాల్గొని అథ్లెటిక్స్ రాణిస్తూ ఎన్నో విజయాలు సాధించారన్నారు. యువతకు అశోక్ ఆదర్శంగా నిలుస్తున్నా రన్నారు. అశోక్‌ను వేల్పూర్ గ్రామ యువకులు, గ్రామప్రజలు అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు సత్తా చాటాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉండి మన హక్కులను రాజకీయ పరంగా సాధించుకునేందుకు కలిసి ముందుకు సాగాలని పిఆర్‌టియుటిఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగర శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు ఆత్మీయ సమ్మేళనంతో పాటు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ నాయకుల వల్లే ఉపాధ్యాయులంతా తమ హక్కులను సాధించుకునేందుకు ఐక్యమత్యంతో విద్యావంతులైన ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన తనను గెలిపించి ఆధరించాలని కోరారు. ఏళ్లతరబడి ప్రభుత్వాలు ఉపాధ్యాయులను చిన్నచూపు చూస్తున్నాయని పదోన్నతులు, టీఏ, డీఏలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల్లో ఉపాధ్యాయులుగా పదోన్న తులు పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహన్‌రెడ్డి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'



అమ్దాపూర్‌లో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



గుండారంలో..



డొంకేశ్వర్‌లో...

బోధన్‌రూరల్,నవంబరు24(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. ఆదివారం బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సన్నరకం వరి ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ జమ కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, నాయకులు పల్లెన్న, సురేందర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోపాల్:రైతులకు అండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు బాగారెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతులకు ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకున్నారని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని కూడా నెరవేర్చారని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు 500లబోనస్ కూడా వారి ఖాతాల్లో వేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఏ పాలకులు కూడా రైతులకు 500ల బోనస్ ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండారం సొసైటీ చైర్మన్ శ్రీధర్, నాయకులు అగ్గుభోజన్న, మార్కెట్ కమిటీ డైరక్టర్లు రాజలింగం, భాగారెడ్డి, సొసైటీ డైరక్టర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్నాల వడ్లకు రూ.500 బోనస్ ప్రభుత్వం మంజూరు చేయడంతో ఆదివారం ఖిల్లా డిచ్‌పల్లి సొసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్, పాలక మండలి సభ్యులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి క్షీరాభిసేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తు ముందుకు వెళ్తున్న సీఎం కు రాష్ట్ర ప్రజలు మరో పదేళ్ల పాటు వెన్నంటే ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రతినిధులు కంచెట్టి గంగాధర్,సాదుల్ల, ఏజీదాస్, ముల్లంగి నర్సయ్య, నర్సారెడ్డి, న్యాస రాజేశ్వర్, జోగుర్, సురేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

డొంకేశ్వర్: రాష్ట్రంలోని రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ వైఎస్.గంగాధర్ అన్నారు. డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సన్నరకానికి రూ.500 బోనస్ ఇస్తూ రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ చేసిందని అన్నారు. అన్నదాతల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మండల అధ్యక్షుడు ఫరీద్, మాజీసర్పంచ్ దశాగౌడ్, గంగారాం, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సర్వే ఆన్‌లైన్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



తహసీల్దార్ శాంతకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

మోస్రా,నవంబరు24(ఆంధ్రజ్యోతి): చందూర్, మోస్రా మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహిస్తున్న సామాజిక సర్వే ఆన్‌లైన్ ఎంట్రీ చేస్తున్న తీరును ఆదివారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. డాటా ఎంట్రీ పరిశీలించి తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోస్రా ఎంపీడీవో ప్రవీణ్ రెడ్డి, తహసీల్దార్ మారుతీ, చందూర్ తహసీల్దార్ శాంత, ఎంపీడీవో నీలావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుంది. మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సుమారు 20 కంప్యూటర్ల ద్వారా ఇంటింటి సర్వేకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు.ఆదివారం పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీవో పరిశీలించారు.

ముప్కాల్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వే వివరాలను జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. ఆదివారం బాల్కొండ మండల పరిషత్ కార్యాలయం డాటా ఎంట్రీ చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. డాటా ఎంట్రీని ఎన్యుమరేటర్‌లకు పక్కగా చేపట్టాలని ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు డాటా ఎంట్రీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

జగదాంబ మందిరంలో ఎమ్మెల్యే పోచారం ప్రత్యేక పూజలు



గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

మోస్రా,నవంబరు24(ఆంధ్రజ్యోతి):మండలంలోని చే నెంబర్ దుబ్బతండాలో నూతనంగా నిర్మించిన జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ఆదివారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆలయ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో 67తండాలు ఉన్నాయని ప్రతి తండాలో జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ మందిరాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రతి తండాలో మందిరాలు ఉండడం వల్ల దుర్గామాత ఆశీర్వాదంతో సేవాలాల్ మహరాజ్‌పైభక్తితో తండావాసులు గుడుంబా, సారా తయారు చేయడం వంటి చెడు అలవాట్లు మానుకొని భక్తిమార్గంలో ఉంటూ పాడిపంటలు సమృద్ధిగా పండిస్తూ ప్రజలందరు అభివృద్ధిలోకి వస్తూ ఆయురారోగ్యాలతో ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వర్ని ఏఎంసీ వైస్ చైర్మన్ కొత్తి మీర్‌కర్ లక్ష్మణ్, ఉమ్మడి మండలాల రైతు సమన్వయ మాజీ కోఆర్డినేటర్ పిట్ల శ్రీరాములు, పార్టీ నాయకులుఅశోక్, హరి నారాయణ, తోటరాజు,హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మెనీ బాయి ధర్మానాయక్, ఉప సర్పంచ్ సతీష్, తండావాసులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ అబ్జర్వర్‌గా జిల్లా క్రీడాకారుడి ఎంపిక

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జడిచర్లలో నిర్వహించనున్న అండర్-19 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్ అబ్జర్వర్‌గా ఎంపికయ్యారు. ముప్కాల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ ఎంపికైనట్లు ఎంఈవో రవికుమార్, హెచ్‌ఎం గంగారాంలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ సెక్రెటరీ జావీద్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ప్రసాద్‌ను అభినందించారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

కమ్మర్‌పల్లి, నవంబరు 24: (ఆంధ్రజ్యోతి) తాము అధికారంలోకి వస్తేవ్యవసాయరంగానికి 11 రకాల పంటలకు బోనస్ ఇస్తామని, రెండు పంటలకు రూ.15 వేల రైతుభరోసా, రెండులక్షల రుణమాఫీ, పనిముట్లు, ఎరువులు, పురుగుమందులపై సబ్సిడి, సకాలంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర హామీలతో గద్దెనెక్కి, హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమయ్యిందని రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపట్ల రాష్ట రైతాంగం తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అఖిలభారత రైతుకూలీ సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కార్యదర్శి దేవారాం, జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి బి బాబన్న అన్నారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండలం లోని ఉప్లూర్, హసాకొత్తూర్, కమ్మర్‌పల్లి, బషీరాబాద్, చౌట్‌పల్లి గ్రామాలలోని వరి కొనుగోలు కేంద్రాలను సంయుక్త సందర్శించి ఆయా గ్రామాల రైతులతో కలిసి పరిశీలించారు. పరిశీలనలో భాగంగా వాస్తవ సేకరణ చేసి నివేదికలు సిద్ధం చేశారు. ఈ నివేదికలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ హామీలు అమలుకు నోచుకోక పోవడంతో రైతుల్లో అసంతృప్తి ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసమే హామీలిచిందని తాము భావిస్తున్నామన్నారు. 2లక్షల రుణమాఫీ 30 నుంచి 40 శాతం మంది రైతుకు అమలుకాలేదని ఈ ప్రాంత రైతులు ప్రభుత్వ తీరు పట్ల గుర్రుగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్నికల ముందు రైతులకిచ్చిన హామీలను ప్రభుత్వం తూచాతప్పకుండా అమలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే జరిపి అమలు తీరుతెన్నులపై రాష్ట వ్యవసాయశాఖమంత్రి, వ్యవసాయ శాఖ కమిషనర్‌లకు నివేదిస్తామన్నారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన బృందంసభ్యులు సురేష్, కిషన్, బాబన్న బాలయ్య, సత్తెక్క, అశోక్ పరిశీలనలో ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నవీపేట,నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన జడల చిన్నుబాయి(70)అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 11న స్థానికంగా ఉన్న శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో పూజ చేసుకోవడానికి చిన్నుబాయి వెళ్లిందని ఈ సమయంలో అక్కడే ఉన్న దీపం ఆమె చీరకు నిప్పు అంటుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. వెంటనే ఆమెను స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారని మెరుగైన చికిత్స కోసం ఈ నెల 14న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందన్నారు. చికిత్స పొందుతూ చిన్నుబాయి ఆదివారం మృతి చెందిందని, మృతురాలి కుమారుడు జడల లక్ష్మణ్ ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్షత్రియ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవం

ఆర్మూర్‌రూరల్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): అర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఎన్‌సిసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి కెడెట్లు కళాశాల ప్రాంగణంలో, గోవింద్‌పెట్ శివారులో మొక్కలు నాటారు. మార్చ్‌పాస్ట్ అనంతరం క్రమశిక్షణ, దేశభక్తి, పై ప్రదర్శనలు, దేశభక్తి పాటలు, నాటకాలతో కూడిన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళా శాల కొశాదికారి అల్జాపూర్ గంగాదర్, ప్రిన్సిపాల్ అర్‌కె పాండు,ఎన్‌సిసి అదికారి వెంకటేష్ అధ్యాపకులు ఎన్ సిసి కెడెట్లు పాల్గొన్నారు.

బాధితురాలికి 10వేల ఆర్థిక సహాయం

ఏర్గట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అఫ్రష్‌బి ఇటీవలే అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా బాధితురాలు నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ తక్షణ సహాయం కింది 10వేలు పంపగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు బాధితురాలికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం జీవన్, ముస్కు మోహన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా చిరంజీవి

నవీపేట,నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా బందెల చిరంజీవి నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఈ నియామకం జరిపినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కిషన్, జీవన్, మైలారం బాబు, వెంకట్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు మానికోళ్ల గంగాధర్ తదితరులున్నారు.

నేడు పాలెంలో లక్ష దీపోత్సవం



రంజిత్ శర్మ

మోర్తాడ్,నవంబరు24(ఆంధ్రజ్యోతి):మండలంలోని పాలెం గ్రామంలో సాయంత్రం 5.30 గంటలకు లక్ష దీపోత్సవం నిర్వహించబడుతుందని సహసం రంజిత్‌కుమార్‌శర్మ తెలిపారు. ఒకే వేదికపై హరిహరుల కల్యాణం, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం అన్న పూర్ణ సమేత మహాదేవస్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. అంతేగాక లక్ష దీపోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమానికి పరిసర గ్రామా లకు చెందిన భక్తులు పాల్గొని హరిహరుల అనుగ్రహం పొందాలని రంజిత్ కుమార్ శర్మ కోరారు.

మెండోరలో భీమన్న దేవుడు ఉత్సవాలు



బీమన్న దేవుని ఊరేగిస్తున్న నాయకపోడు కులస్థులు

మెండోర, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీమన్న దేవుడు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ ఆదివాసి నాయకపోడు కులస్థులు బీమన్న ఆలయం వద్ద ఉన్న దేవుడు గజాను గ్రామంలోకి తీసుకువచ్చి దేవుడి గజాలను గ్రామ వీధులగుండా ఊరేగిస్తున్నారు. ఆదివారం ఉదయం బీమన్న దేదుని గజాలు గంగాస్నానం కోసం పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నదికి బయలుదేరి ఆదివారం సాయంత్రం బీమన్న దేవుని ఆలయానికి చేరుకొని సోమవారం వేకువ జామున బీమన్న దువుని కల్యాణం, నాగవెల్లి, అగ్నిగుండం కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత గ్రామ ఆదివాసి నాయకపోడు కులస్థులందరు బీమన్న ఆలయం వద్దకు వనభోజనాలకు వెళ్లాలని ఆదివాసి నాయకపోడు కులస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకపోడులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఆర్మూర్‌టౌన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 26, 27వార్డుల్లో పలువురు లబ్ధిదారులకు ఆదివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీజేవైఎం ఉపాధ్యక్షుడు పెద్దోళ్ల భరత్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలి పారు.

గ్రంథాలయ ఆధునికీకరణకు రూ.5లక్షలు

ధర్పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల శాఖా గ్రం థాలయ ఆధునికీకరణ పనుల కోసం రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజారెడ్డి తెలిపారు. ఆదివారం ధర్పల్లి గ్రామం లోగల గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు కాంపిటేషన్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠకుల కోసం సైతం అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నా యన్నారు. సిరికొండలో నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించేం దుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. గ్రామంలో గల గ్రంథాలయాన్ని ఆధునీకరించేందుకు మరు గుదొడ్లు, నీటి సౌకర్యం, తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.5లక్షలు మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం గ్రంథాలయ పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య, గ్రంథపాలకుడు కిషన్ ఉన్నారు.

కుల,గణనలో లేనివారు స్థానిక గ్రామపంచాయతీలో నమోదు చేయించుకోవాలి

కమ్మర్‌పల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కులగణన సర్వే సమయంలో అందుబాటులో లేని కుటుంబాలు స్థానిక గ్రామపంచాయతీలో నమోదు చేయించుకోవాలని పంచాయతీ కార్యదర్శి శాంతికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వారం రోజులపాటు సర్వే జరిగిందని కొన్ని కుటుంబాలు ఆ సమయంలో అందుబాటులో లేక పోవడం ఎన్యూమరేటర్లు వెనుదిరిగి మిగితావారి సర్వేను పూర్తిచేసి అప్పగించాలరని తెలిపారు. అందుబాటులో లేని కుటుంబాలవారు ఇబ్బందులు పడకుండా వారికోసం గ్రామపంచాయతీలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని అట్టివారు తమ కుటుంబ వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఈమేరకు గ్రామంలో మైక్‌అనౌన్స్ సైతం చేయిచామన్నారు.

పెగడాపల్లిలో మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన

బోధన్‌రూరల్,నవంబరు24(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలోని శ్రీ మహలక్ష్మి మందిరం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆదివారం గణపతి పూజ, యజ్ఞ హోమం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర అంతర్జాతీయ కళాకారులు నర్ర సతీష్ ఒగ్గు కథను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ లక్మారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పోతారెడ్డి, సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, మేడి రవి, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, నాగభూషణ్ రెడ్డి, ఒడ్డెన్న, సాయిలు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● నేడు ఎమ్మెల్యేచే అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన

పెగడాపల్లి గ్రామంలోని అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నేడు ఉంటుందని, ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పాల్గొంటారని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు

జక్రాన్‌పల్లి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): దాతలు ఇచ్చిన విరాళాలతో గ్రామస్థుల సహకారంతో మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శుక్రవారందేవుడు ఆలయ నిర్మాణ పనులు చకచక కొనసాగుతున్నాయి. విగ్రహ దాత గ్రామానికి చెందిన ముత్యంగౌడ్ రూ.50 వేల విరాళాలు ఇచ్చి శుక్రవారందేవుని విగ్రహాన్ని కొనుగోలు చేసి ఇచ్చారు. దాతలు, కొలిప్యాక్ గ్రామస్థులు, వీడీసీసభ్యుల సహకారంతో సుమారు రూ.6లక్షలతో శుక్రవారందేవుడు ఆలయ నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ శుక్రవారందేవుడు ఆలయ నిర్మాణ పనులను ఆలయ కమిటీ సభ్యులు కుంట చిన్న నర్సయ్య, సుధాకర్, గంగాధర్‌లు పరిశీలించారు. దాతలు, గ్రామస్థులు, వీడీసీ సభ్యులు ముందుకు వచ్చి శుక్రవారందేవుడు ఆలయం నిర్మించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జంబిహన్మాన్‌లో నేటి నుంచి అన్నదానం

ఆర్మూర్‌టౌన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): జంబి హన్మాన్ ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాల దారులకు నేటి నుంచి అన్నసత్రం ఏర్పాటు చేసినట్టు అయ్యప్ప సేవ సమితి అధ్యక్షుడు పెంట జలంధర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ 17ఏళ్ళుగా అన్నసత్రం ఏర్పాటు చేస్తున్నామని, అలాగే నేటి నుంచి 41 రోజుల పాటు అయ్యప్పస్వాములకు అన్నప్రసాదం(బిక్ష) ఏర్పా టు చేస్తున్నట్టు అయ్యప్పమాల ధరించి స్వాములు ఉదయం 12. 30నుంచి 3గంటల వరకు సద్వి నియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి గౌరవ అధ్య క్షుడు జనార్ధన్ గౌడ్, మీసాల రాజేశ్వర్, దస్‌పాల్ శివ, చేపూర్ ధనుంజయ్, మీసాలమహేష్, సురేష్, నరేష్, పాల్గొన్నారు.



నిజాంసాగర్‌లోని నవోదయ విద్యాలయం ఇదే..

ఆంధ్రజ్యోతి ఫోకస్



సర్వే నెం.560లో గల 400 ఎకరాల భూమి ఇదే..



ఆదర్శ పాఠశాల పక్కన గల సమ్మర్ బాగ్ ఇదే..



నిజాంసాగర్ ప్రాజెక్టు ఇదే..

నిరాశలో.. నైజాం నాటి నిజాంసాగర్!

■ ఉమ్మడి జిల్లాలో ఏకైక నవోదయ పాఠశాల నిజాంసాగర్‌లోనే.. ■ ఏళ్లు గడిచినా.. ఒక్క రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు కాలేదు ■ నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో దాదాపు 400 ఎకరాల ప్రభుత్వ భూమి ■ కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం ఏర్పాటు ■ ఎన్నికల హామీలకే పరిమితమవుతున్న నిజాంసాగర్ విద్య హబ్ ■ ప్రభుత్వాలు, పాలకులు మారినా నిర్లక్ష్యమే.. ■ పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా నిజాంసాగర్ పరిస్థితి

నిజాంసాగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పాలకులు ఏళ్ల తరబడి నుంచి మారుతూనే ఉన్నారు. కానీ, విద్యాపరంగా నిజాంసాగర్‌కు మొండి చెయ్యి మిగులుతోంది. ఏళ్ల నుంచి నిజాంసాగర్‌లో ఏఒక్క రెసిడెన్షి యల్ స్కూల్ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోయింది. నిజాంసాగర్ అంటేనే ఇంత నిర్లక్ష్యమా? అని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నైజాం ప్రభుత్వంలో మంజీరా నదిపై నిర్మాణం చేపట్టారు. ఉమ్మడి నిజామాబాద్‌లో సిరులు పండుతున్నా యి. అప్పట్లో నిజామాబాద్ జిల్లాకు ధాన్యాగారంగా కీర్తి లభించింది. ఈ నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నిజాంసాగర్ మండలంలో కమాండ్ ఏరియా నాన్ కమాండ్ ఏరియాలు ఉన్నాయి. కమాండ్ ఏరియా నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కాగా నాన్ కమాండ్ ఏరియా కిందట 3300 ఎకరాల భూమికి సాగునీరు అందిస్తుంది. నాన్ కమాండ్ ఏరియా రైతాంగం చెరువులు మంజీరా నదిపైనే ఆధారపడి ఉంటూ వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారు. నిజాంసాగర్ నిర్మాణ దశలోనే నాన్ కమాండ్ ఏరియాకు కాలువలు తవ్వలేక పోవడంతో నాన్ కమాండ్ ఏరియా రైతులకు అన్యాయం జరిగింది. నైజాం కలలను సహకారం చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిజాంసాగర్ మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. అప్పట్లో గ్రామ గ్రామాన ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 1986-87 సంవత్సరంలో కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వ ర్యంలో జవహర్‌నగర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేసింది. ఈ విద్యాలయం నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల ప్రాంతంలోని గో డౌన్‌లో పాఠశాలను కొనసాగించారు. 1990-92 ఆర్థిక సంవత్సరంలో 560 సర్వే నెంబర్లు దాదాపు 30 ఎకరాల్లో నవోదయ విద్యాలయ భవన సముదాయాలను నిర్మాణం చేసి జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి నవోదయ విద్యాలయం సొంత భవనంలోనే కొన సాగుతోంది. జవహర్ నవోదయ విద్యాలయంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో విద్యా భ్యాసం చేసే బాల బాలికలకు 5వ తరగతి పూర్తి చేసిన వారికి నవోదయ విద్యాలయంలో ఎంట్రెన్స్ ద్వారా విద్యాలయంలో ఆరో తరగతిలో విద్యా భ్యాసం చేసినందుకు ఎంపిక చేసుకుంటారు. ప్రతియేటా 6వ తరగతిలో 80మంది బాల బాలికలను చేర్చుకుంటారు. ఈ విద్యాలయంలో ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం కొనసాగుతోంది. ఈ విద్యాలయంలోని పదేళ్ల కిందట కేంద్ర మంత్రిత్వ శాఖ క్రీడా స్కూల్ మంజూరు చేస్తామని ప్రకటించిన క్రీడా పాఠశాల కార్యరూపం దాల్చలేక పోయింది. 2012-13 ఆర్థిక సంవత్సరంలో కస్తూర్బాగాంధీ విద్యాలయంతో పాటు ఆదర్శ పాఠశాలను కూడా ఏర్పాటు చేసింది. కానీ ఆదర్శ పాఠశాల రెసిడెన్షియల్ ఏర్పాటు చేయలేక పోయారు. కేవలం బాలబాలికలు ప్రతీరోజు ఇళ్ల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తూ ఉంటారు. కస్తూర్బాలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు కేవలం బాలికల విద్యాలయంగానే కొనసాగుతోంది.

ప్రాజెక్టుపై పాలకుల నిర్లక్ష్యం!!

నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రపంచంలోనే మొదటి ప్రాజెక్టుగా కీర్తి ఉన్నప్పటికీ.. పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిజాంసాగర్ కీర్తి లేకుండా పోయింది. 2016-17లో మండలంలోని అచ్చంపేట గ్రామంలో రూ.3కోట్ల వ్యయంతో సాంఘీక సంక్షేమ శాఖ పర్యవేక్షణలో సమీకృత హాస్టల్ భవన సముదాయన్ని నిర్మాణం చేశారు. ఈ హాస్టల్ భవన సముదాయంలో నిజాంసాగర్ మండల కేంద్రంలో ఉన్న బీసీ హాస్టల్, పిట్లం మండల కేంద్రంలో ఉన్న ఎస్టీ హాస్టల్‌తో పాటు అచ్చంపేటలో కొనసాగుతున్న ఎస్సీ హాస్టల్‌లను విలీనం చేసి సమీకృతంలో విద్యార్థులు ఉంటూ అచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసేందుకు అప్పటి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. 2017లో తెలంగాణ అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా సమీకృత హాస్టల్ భవన సము దాయాన్ని ప్రారంభించారు. అప్పట్లో మంత్రి నిజాంసాగర్ కేంద్రంలో ఉన్న బీసీ హాస్టల్‌ను పిట్లం మండల కేంద్రంలో ఉన్న ఎస్టీ హాస్టల్‌లను సమీకృతం లో విలీనం చేయరాదని ఆదేశించారు అప్పట్లో అధికార యంత్రాం గం ఈ విషయమై ప్రభుత్వానికి నివేదించారు. పిట్లం, నిజాంసాగర్‌లో ఉన్న హాస్టల్ లను సమీకృతంలో విలీనం చేయరాదని ఉత్తర్వులు జారీ చేశారు. పిట్లం నిజాంసాగర్ హాస్టళ్లు ఎక్కడికక్కడే కొనసాగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వ హయాంలో గురుకులాలు మంజూరైనప్పటికీ నిజాంసాగర్ మండలానికి గురుకుల పాఠశాల మంజూరు దక్కలేక పోయింది. జుక్కల్ నియోజక వర్గం పరిధిలోని జుక్కల్ మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంజూరు చేశారు. ఈ పాఠశాల కొన్నాళ్ల పాటు పురాతన ఆసుపత్రి పోలీస్‌స్టేషన్‌లో కొనసాగింది. గురుకుల పాఠశాలకు జుక్కల్‌లో మౌలిక సదుపాయాలు లేవంటూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ నిజాంసాగర్ ప్రాజెక్టు సమీపంలో ఉన్న అచ్చంపేట సమీకృత హాస్టల్‌లోనికి జుక్కల్ గురుకుల పాఠశాలను తరలించారు. జుక్కల్‌లో గురుకల విద్యాలయం భవన సముదాయనిర్మాణం కోసం దాదాపు 20ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించారు. కానీ ఇప్పటి వరకు జుక్కల్‌లో గురుకుల విద్యాలయం భవన సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరుకు నోచుకోలేదు. అచ్చం పేట సమీకృతంలో అరకొర వసతుల మధ్య 500మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగడం విశేషం.

బాలికల రెసిడెన్షియల్ బాల్కొండకు..

నిజాంసాగర్ మండల పరిధిలో అచ్చంపేట గ్రామంలో 1990-91లో బాలికల రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైనప్పటికీ.. ఈ పాఠశాలను కూడా నిజాంసాగర్‌లో ఏర్పాటు చేయకుండా అప్పట్లో ఉన్న పాలకులు బాల్కొండకు తరలించారు. నిజాంసాగర్ ఉమ్మడి మండలంలో ఇప్పటి వరకు 49 ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కొనసాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోని అప్పట్లో నిజాంసాగర్ మండలం మహ్మద్‌నగర్‌లో బాలికల, బాలుర వసతి గృహ లను ఏర్పాటు చేస్తామన్న పాలకులు అధికారులు మర్చిపోయారు. దాదాపు 25ఏళ్ల కిందట నుంచి ప్రస్తుతం ఉమ్మడి నిజాంసాగర్ మండలంలో ఏ ఒక్క రెసిడెన్షియల్ విద్యాలయాన్ని ఏర్పాటుకు నోచుకోవడం లేదని నిజాంసాగర్ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యానందించాలనే లక్ష్యంతో ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ పాఠశాలను నియోజకవర్గం ఒకటి చొప్పున మొదటి విడతలో ఏర్పాటు చేయనుంది. జుక్కల్ నియోజకవర్గంలో నిజాంసాగర్ మహ్మద్ నగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్, డోంగ్లి, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో గురుకుల పాఠశాలలు గురుకుల కళాశాలలు ఆదర్శ పాఠశాలను కొనసాగుతున్నాయి. నిజాంసాగర్ ఉమ్మడి మండలంలో గురుకుల పాఠశాల లేనందున విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోని కాకుండా ప్రైవేట్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఏకైక నవోదయ పాఠశాల నిజాంసాగర్ మండలంలో ఉన్నప్పటికీ.. ఉమ్మడి జిల్లాల విద్యార్థులు ఈ పాఠశాలల్లో ప్రతీ సంవత్సరం ప్రవేశ పరీక్షల ద్వారా 80 మందికి ప్రవేశాలు లభిస్తున్నాయి. నిజాంసాగర్ మండలం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మిగిలిందే తప్ప రెసిడెన్షియల్ విద్యాలయాలు లేకపోవడం నిజాంసాగర్ వెనుకబడిపోవడానికి కారణమని చెప్పవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం నిజాంసాగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూమి వందల ఎకరాలు ఉందని, ఈ స్థలంలోనే నియోజకవర్గం ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు సర్వే నెం.560 లో ఉన్న భూమిని పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు (ఫైల్)

పదేళ్లయినా పూర్తికాని డబుల్ ఇళ్ల నిర్మాణ పనులు

● కలగా మిగిలిన ఇళ్ల కేటాయింపులు ● గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్న పేదలు

జర దేఖో!!



న్యాలకల్‌లో నిలచిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం

మోపాల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం ప్రభుత్వ డబుల్‌బెడ్‌రూంల ఇండ్ల నిర్మాణం చేపట్టిందని గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద ప్రజలకు ఆశలుగానే మిగిలాయి. గత ప్రభుత్వం 2015లో నిరుపేదల కోసం మండలంలోని న్యాలకల్ గ్రామంలో 50మంది కోసమని ఇండ్ల నిర్మాణం చేపట్టారు. 50ఇండ్లతో పాటు మరో 50మందికి కూడా ఇండ్లు ఇస్తామని పనులను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కవిత భూమి పూజ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ఇండ్ల నిర్మాణం పూర్తి కాలేదు. మండలంలోని న్యాలకల్ గ్రామంలోనే డబుల్‌బెడ్‌రూంల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. తమకు ఇండ్లు వస్తున్నాయని గ్రామంలో ఉన్న అనేక మంది అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇండ్లలో నివసిస్తున్నామని అప్పటి ముఖ్యమంత్రి పేదల పట్ల దయ చూపి డబుల్ బెడ్‌రూంల ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేయడంతో సంతోషపడ్డామన్నారు. ఈ కల కలగానే మిగిలి పోయి గ్రామాల్లో చర్చనీయాంశమైంది. పేదల ఇండ్ల నిర్మాణం కోసం అనేక సంవత్సరాల నుంచి ఉద్యమాలు అధికారులకు విన్నపాలు చేశామని అనేక గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. పదేళ్లు అవుతున్న ఇండ్ల నిర్మాణం గ్రామాల్లో అర్థంతంగా నిలచిపోయిందని న్యాలకల్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత కాంట్రాక్టరుకు స్థానికులు అడుగగా తమకు బిల్లులు రాకపోవడం వల్లే నిర్మాణం పనులు అర్ధంతంగా నిలపివేయడం జరిగిందని తెలిపారు. డబుల్‌బెడ్‌రూం వద్ద కాంట్రాక్టర్ వేసిన ఇసుక, కంకరతోపాటు సిమెంట్ ఇటుకలను కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకపోయారని స్థానికులు తెలిపారు.

● పేదలకు ఇళ్లు ఇవ్వాలి : భాగ్యలక్ష్మి, న్యాల్‌కల్



గ్రామంలో అర్హులైన పేదలను గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలి. ఎన్నో ఏళ్లుగా అద్దె భవనాల్లో నివసిస్తున్నాము. గ్రామంలో చేపట్టిన డబుల్‌బెడ్ రూంల నిర్మాణం అర్ధంతంగా నిలచిపోయింది.అధికారులు స్పందించి పేదలకు న్యాయం చేయాలి.

● పాలకుల నిర్లక్ష్యం : ఉమాపతి, న్యాల్‌కల్



గ్రామంలో డబుల్‌బెడ్‌రూంల ఇళ్ల నిర్మాణం జరుగడంతో పేదల కల నెరవేరుతుందనుకున్నాము. సంవత్సరాల తరబడి అద్దె బవనాల్లో నివసిస్తున్నాము. గ్రామానికి వచ్చి ఎన్నో సంవత్సరాలు అవుతుంది. ఇప్పటికి అద్దె బవనంలోనే నివసిస్తున్నాము. ఇండ్లు వస్తున్నాయంటే అధికారులకు ధరఖాస్తులు చేసుకన్నాము. ఫలితం లేకపోయింది.

● ఇళ్ల కోసం ఉద్యమం : సాయగౌడ్, ప్రజాపంథా జిల్లా నాయకులు



మండలంలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇండ్ల నిర్మాణం చేయాలని ఎన్నో సంవత్సరాల నుంచి ఉద్యమాలను చేస్తున్నాము. పాలకులు మాత్రం పేదలకు ఇండ్ల స్థలాలు ఇండ్ల నిర్మాణం చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వం పేదలకు న్యాయం చేసే విధంగా ఉండాలి.



శిథిలావస్థలో ఒకప్పుడు మినీ కలెక్టరేట్‌గా బాసిల్లిన టీటీడీసీ భవనం



భవనాల మధ్య ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

మూలనపడ్డ మినీ కలెక్టరేట్!

● చరిత్ర నాడు ఘనం.. నేడు అధ్వానం ● మినీ కలెక్టరేట్‌గా బాసిల్లిన డిచ్‌పల్లిలోని టీటీడీసీ మూసివేత ● తిరిగి తెరిపించాలని మహిళా సమాఖ్య సంఘాల డిమాండ్

ఆంధ్రజ్యోతి పరిశీలన

డిచ్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మినీ కలెక్టర్ కార్యాలయంగా బాసిల్లిన డిచ్‌పల్లిలోని టీటీడీసీ కార్యాలయం నేడు పూర్తిగా మూసివేతకు గురి అయ్యింది. గత దశాబ్ద కాలం క్రితం జిల్లా కలెక్టర్‌లు సైతం ఈ టీటీడీసీ కార్యాలయం నుంచే పరిపాలన సాధించిన రోజులు ఉన్నాయి. అదే విధంగా మహిళా సమాఖ్య సంఘాలకు సైతం ఇక్కడు సమావేశాలు, శిక్షణలు ఇచ్చే వారు ఇంతటి ఘనమైన పేరున్న టీటీడీసీ కార్యాలయం నేడు మూతపడింది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళసమాఖ్యల అభివృద్ధి కోసం గతంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, 2003 డిసెంబరు 12న ఈ కార్యాలయం ప్రారంభించారు. ఉమ్మడి రాస్ట్రంలో వెలుగు వెలిగిన ఈ కార్యాలయం రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ఆలనపాలన పట్టించుకోకపోవడంతో పూర్తిగా నిర్వీర్యం చేశారు. సాంకేతిక శిక్షణల అభివృద్ధి పరుచుటకు డిచ్‌పల్లి పరిసర ప్రాంతాల మహిళలకు, యువతకు శిక్షణ నిమిత్తం ఈ కార్యాల యం ఏర్పాటు చేశారు. కొన్నేండ్లు మంచి పేరుతో కొన సాగిన ఈ కార్యాలయం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో పూర్తిగా మూతపడే స్థాయి చేరి గత ఏడాది పూర్తిగా మూసివేశారు. ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని సైతం తొలగించడంతో కార్యాలయం చూసే వారు కరువయ్యారు. తమను తొలగించవద్దని ఉన్నతాధికారులు సిబ్బంది వేడుకున్న పట్టించుకోలేదు. అనంతరం కొద్దిరోజులకే భవనంలో అగ్ని ప్రమాదం సంభవించి విలువైన కంప్యూటర్‌లు, ఏసీలు, దస్త్రాలు కాలి పోయాయి. గతంలో జిల్లా కలెక్టర్ లుగా పనిచేసిన డీవీ రాయుడు లాంటి వాళ్లు ఇక్కడి నుంచే జిల్లా పరిపాలన కొనిసాగించిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ కార్యాలయంలో జిల్లా మహిళా సమాఖ్య సమావేశాలతో పాటు యువతకు పలు రకాల స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ లు డీఆర్‌డీఏ ద్వార ఉచితంగా అందించేవారు. కానీ కాలక్రమేణ అధికారుల నిర్లక్ష్యం వల్ల అటువైపు కన్నెతి చూసే నాథుడే కరువయ్యారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లో కూడా ఈ కార్యాలయంలో పట్టించుకోలేదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా ఈ కార్యాలయంపై శ్రద్ధ వహించి వాడుకలోకి తీసుకురావలని, ఇంత పెద్దస్థాయి భవనంను నిర్లక్ష్యంగా వదిలేయకుండా.. తిరిగి పునర్ ప్రారంభించి మహిళా సమాఖ్యల సమావేశాలకు, యువతకు ఉచిత శిక్షణలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఈ భవనంలో ఉన్న విలువైన పరికరాలు తుప్పుపట్టి నిరుపయోగం మారుతున్నాయి. గదుల తలుపులను దొంగలు చోరీ చే శారు. భవనం పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. ఎంతో విలువ ఈ భవనం, స్థలం కబ్జాకు గురయ్యే ఆవకాశం ఉందని, వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వాడుకలోకి తీసుకురావలని మహిల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



2003లో అప్పటి మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ప్రారంభించిన శిలాఫలకం



ధ్వంసమైన కంప్యూటర్ భవనం



భవనంలోని గదుల తలుపులు తొలగించారిలా..



పెచ్చులూడిపోతున్న భవనం పైకప్పు

నగరంలో కార్తీక వనభోజనం



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం అనగానే గుర్తుకువచ్చే వన భోజన కార్యక్రమం తెలంగాణ బ్రాహ్మణ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆనందోత్సాహాలతో సాగింది. జిల్లా కేంద్రంలోని బోర్గాం(పి)లోగల లక్ష్మీగణపతి ఆలయంలో ఒకే వేదికపై బ్రాహ్మణులు కలుసుకొని కుశల ప్రశ్నలతో ఆత్మీయ పలకరింపులతో వనభోజనం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రకృతి రమణీయంగా ఉంటుందని శివకేశవులకు ప్రీతికరమైన ఈ మాసంలో వనభోజనాలు చేయడం సాంప్రదాయంగా వస్తుందని అన్నారు. బ్రాహ్మణులు ఐక్యతతో ముందుకు సాగి దేశ అభివృద్ధిలో తమకంటే ప్రత్యేక స్థానాన్ని నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేసిన పలువురిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిధర్‌రావు దేశ్‌ముఖ్, మంజుల, చంద్రశేఖర్, ప్రాణేశ్వరరావు, అప్పాల కృష్ణయ్య, జగపతి రావు, పెద్ద సంఖ్యలో బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు


షబ్బీర్ అలీని సన్మానిస్తున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, తదితరులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):టిఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాశెట్టి సుమన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్‌ను హైదరాబాద్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుమన్‌ను షబ్బీర్ అలీ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయనతో పాటు నుడా చైర్మన్ కేశవేణు, టిఎన్‌జీవో జిల్లా కార్యదర్శి శేఖర్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, సంజీవయ్య, దినేష్, తదితరులు పాల్గొన్నారు.


సంఘాల ఆధ్వర్యంలో గడుగుకు సన్మానం


సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న గడుగు గంగాధర్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమీషన్ సభ్యుడిగా నియమితులైన గడుగు గంగాధర్‌ను ఆదివారం పలు సంఘాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగాస్థాన్-2 మాలసంఘంతో పాటు బంగారు మైసమ్మ తర్ప మాదిగ సంఘం, 38వ డివిజన్ మాలసంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్‌లో సభ్యుడిగా నియమించడం గర్వంగా ఉందన్నారు. రైతుల సమస్యలను అన్ని విధాలుగా ప్రభుత్వంతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నిర్మల్, నిజామాబాద్ వ్యవసాయ శాఖ ఉద్యోగులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కోటగిరి,నవంబరు24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పేర్కొన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆదివారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టార్లను, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. 10వ తరగతి ఫలితాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శ్యామల తదితరులున్నారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో అశోక్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

రెంజల్,నవంబరు24(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వీరన్నగుట్ట తండా, బోర్గాం, మౌలాలి తండా గ్రామాలలో నూతన పంచాయతీ భవనాలకు భూమిపూజ చేశారు. అనంతరం మండలానికి చెందిన 59మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని అన్నారు. గత ప్రభుత్వాలు ఏం చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలే తప్ప పదేళ్లలలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది శూన్యమని అన్నారు. రైతు సంక్షేమం కోసం పాటుపడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ప్రతి గడప గడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. సంవత్సరకాలంలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. గ్రామ పంచాయతీలకు పక్క భవనాలను ఉండాలన్న ఉద్దేశంతో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఒక్కో గ్రామ పంచాయతీకి 20లక్షల వ్యయంతో కొత్త భవనాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. డ్రైనేజీల నిర్మాణాలకు అదనపు నిధులు సమకూరుస్తున్నామన్నారు. రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు ఒక్కో గ్రామానికి 3లక్షలు కేటాయిస్తామన్నారు. గడిచిన ఏడాది కాలంలోనే ఇచ్చిన హామీలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అందించడం జరిగిందని, రైతులకు 500రూపాయల బోనస్ అందించడం జరిగిందని, బోధన్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తీసుకువస్తుందని, రైతులు చెరకు పండించాలని అన్నారు. 80శాతం కల్తీ పాలు వాడడం వల్ల క్యాన్సర్‌కు గురవుతున్నారని దీనిని ఉద్దేశించి రాష్ట్ర ప్రభుత్వం విజయ డైరీల ద్వారా పాలను ఉత్పత్తి చేస్తుందని ప్రతి ఒక్కరు విజయ డైరీ ద్వారానే పాల ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆరోగ్యానికి కాపాడుకోవాలని సూచించారు. గ్రామాలలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఎన్నికలలో గెలుపోటములు సహజమని, గ్రామంలోని ప్రజలు వాటన్నింటిని పక్కన పెట్టి అందరు కలిసి కట్టుగా ఐక్యమత్యంతో ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం కమీషన్ సభ్యుడు గడుగు గంగాదర్, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, నాయకులు రాములు, సాయిరెడ్డి, సాయిబాబా గౌడ్, సురేందర్ గౌడ్, జావీదొద్దీన్, నితిన్, హన్మంత్ రావు, హాజీఖాన్, ధనుంజయ్, జాదవ్ గణేష్, కార్తీక్, రవి, కృష్ణ, మోహన్, ఎంఎల్ రాజు, వంశీ, రాజు, సురేష్, ఖుద్దుస్, షంషోద్దీన్, షబాజ్, సల్మాన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుంది. సభ్యత్వ నమో దు కార్యక్రమంలో ముఖ్య అతిథులు హాజరై నమోదు కార్యక్రమాన్ని జోరు గా సాగిస్తున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో నిర్వ హించిన కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు అంబిక సత్యనారాయణ, ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ ఆధ్వ ర్యంలో సభ్యత్వ నమోదును చేపట్టారు. సభ్యత్వ నమోదు చేసిన తర్వాత స భ్యుడికి రిసిప్ట్ అందజేసి తెలుగుదేశం పార్టీ విదివిధానాలను తెలియ జేశా రు. ఈ కార్యక్రమంలో రాజు, రాజేశ్వర్,లక్ష్మియాదవ్ పాల్గొన్నారు.

మల్టీజోన్-1లో పలువురు సీఐల బదిలీలు

ఖిల్లా, నవంబరు24(ఆంధ్రజ్యోతి):మల్టీజోన్-1లో పలువురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిది మందిలో జిల్లాలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న వీరయ్యను పీసీఆర్ ఎగ్జిస్టింగ్ వేకెన్సీస్‌కు బదిలీ చేశారు. ఐజీ కార్యాలయంలో వేయిటింగ్‌లో ఉన్న బి.నరహరిని డీసీఆర్‌బి నిర్మల్ ఎగ్జిస్టింగ్ వెకెన్సీస్‌కు బదిలీ చేశారు. ఆదిలాబాద్ డీసీఆర్‌బిలో పని చేస్తున్న పబ్బప్రసాద్‌ను నిజామాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.మల్టీజోన్-1 ఐజీ కార్యాలయంలో వేయిటింగ్‌లో ఉన్న ఎస్.సతీష్‌కుమార్‌ను సీసీఆర్‌బి నిజామాబాద్ ఎగ్జిస్టింగ్ వేయిటింగ్‌కు బదిలీ చేశారు.

దుబాయిలో సుద్దపల్లి యువకుడి మృతి

డిచ్‌పల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిని మేకల హరిశ్ శనివారం చేతి నొప్పి వస్తుందని తన తోటి కార్మికులకు తెలుపగా వారు రూం కు తీసుకెళ్లేలోపు హరిశ్ గుండె పోటులో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహన్ని స్వగ్రామానికి త్వరగా చేరేల ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్‌లు చొరవ చూపాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు. మృతునికి భార్య రాజమని, కుమారులు విస్ణు, విఘ్నేశ్ లు ఉన్నారు.

అభ్యాసలో చెన్న శ్రీనివాస్ మెమోరియల్ టోర్నమెంట్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):నగరంలోని అభ్యాస దస్కూల్‌లో దివంగత స్కూల్ కరస్పాండెంట్ చెన్న శ్రీనివాస్ జ్ఞాపకార్థం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. నగరంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీలో జిల్లాలోని 16 పాఠశాలలు పాల్గొనగా పాఠశాలలో చెస్, క్యారమ్, టేబుల్ టెన్నిస్, స్కిప్పింగ్, డాచ్‌బాల్, రన్నింగ్‌రేస్, ఎలిఫెట్ వాక్, ఫ్రాగ్ జంప్, మ్యూజికల్ చైర్, ఖోఖో పోటీలు నిర్వహించి ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్‌రావు పాల్గొని బహుమతులు అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ చెన్న అన్నపూర్ణ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ అభ్యాస స్కూల్ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే ప్రయత్నాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ నాగరాజు, డైరెక్టర్లు శ్రీనివాస్, శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడపాకల్‌లో ఉచిత వైద్య శిబిరం

ఏర్గట్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడపాకల్ గ్రామంలో ఆదివారం స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 200 మందికి డాక్టర్ ప్రకాష్, డాక్టర్ అమర్నాథ్, డాక్టర్ అపర్ణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్పందన ఫౌండేషన్ నిర్వాహకులు నలిన్ ఇల్లెందుల మాట్లాడుతూ ఆర్మూర్ అపర్ణ హాస్పిటల్ ఆధ్వర్యంలో అడిగిన వెంటనే వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ఫౌండేషన్ జ్యోతి, కరుణ ట్రస్ట్ ఫౌండర్ మహేష్, పత్తిరెడ్డి ప్రకాష్ రెడ్డి, కిషన్, భాస్కర్, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న ఇడంబియా మాత కల్యాణోత్సం

కమ్మర్‌పల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నాయకపోడ్ కులఆరాధ్య దైవం భీమన్న ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా గ్రామనాయకపోడ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి భీమన్న, ఇడంబియామాత కల్యాణోత్సం అంగరంగ వైభ వంగా నిర్వహించారు. గత ముడురోజులగా సాగిన ఉత్సవాల్లో భాగంగ ఆదివారం ఉదయం ఆలంవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కలాృణం సం దర్బంగా కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పసుపు బసంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకపోడ్ సంఘం అధ్యక్షుడు పెద్ది శ్రావణ్, ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, శ్రీకాం త్ నాయకపోడ్ సంఘం మండల అధ్యక్షుడు పెద్దినారాయణ,కులసంఘం సభ్యులు, మహిళలు తదితరలు పాల్గొన్నారు.


హసాకొత్తూర్ స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న నాయకపోడ్ సంఘ సభ్యులు

డొంకేశ్వర్‌లో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎమ్మెల్యే చిత్రపటానికిక్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

డొంకేశ్వర్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ నియోజకవర్గంలో పేద విద్యార్థులందరికి మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాదర్ అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు అయిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి చిత్రపటానికి మండల బీజేపీ అధ్యక్షుడు పోతుగంటి సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. ఆర్మూర్ నియోజకవర్గ విద్య, వైద్యం, సంక్షేమ పథకాలలో ముందుండాలని విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మారంపల్లి గంగాదర్, పొల్కం వేణు, సాగర్, భూమన్న, రాజేశ్వర్, విట్టల్, ముత్యం, నరేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే వివరాలు నమోదు

డిచ్‌పల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో పాల్గొనలేని కుటుంబాల వివరాలను సర్వేలో నమోదు చేయించేందుకు నడిపల్లి పంచాయతీ ఈవో కిషన్ రావు సిబ్బందితో సర్వే వివరాలను నమోదు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబాల వివరాలు ఎన్యుమలేటర్ లు నమోదు చేసుకున్నారు.

జీవన భృతిని చెల్లించాలి

సిరికొండ నవంబరు 24(ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వ్యవసా కూలీలందరికి రూ.12 వేల జీవనభృతి వెంటనే చెల్లించాలని ఈ నెల 27న తహసీ ల్దార్ కార్యలయం ముందు జరిగే ధర్నాకు తరలిరా వాలని వ్యవసాయ కూలీలను సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు దామోదర్ పిలుపు నిచ్చారు. ఆది వారం మండలంలోని మైలారం, ఉర్దుల్‌పెట్,మూషీర్‌నగర్ గ్రామాల్లో ఏఐకేఎంఎస్ నాయకులు ఇంటింట ప్రచారం చేసి కరపత్రాలను పం పిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్, సాయరెడ్డి,ఈ.రమేష్ పాల్గొన్నారు.

‘ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి ’

సుభాష్‌నగర్,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్య దర్శి నూర్జహాన్ అన్నారు. సీఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 29న చలో డిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ ధర్నా చేపట్టామన్నారు. ఆశావర్కర్లకు వేతన పెంపుతో పాటు సామాజిక భద్రత కింద నెలకు రూ.10వేల పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా నాయకులు రమ,సుఖన్య, లావణ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ధర్పల్లి,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో గల బీసీ కాలనీలో ప్రతిష్ఠించిన బంగారు మైసమ్మ వార్షికోత్స వం ఆదివారం అత్యంత వైభవం గా కాలనీ వాసులు నిర్వ హించారు. ద్వితీయ వార్షికో త్సవం సందర్బంగా అమ్మ వారిని ప్రత్యేకంగా అలంక రించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు

ఘన్‌పూర్‌లో బోనాల ఊరేగింపు

డిచ్‌పల్లి, నవంబరు 24 మండలంలోని ఘన్‌పూర్ లో ఆదివారం మహిళలు గ్రామ దేవతలకు బోనాలు ఊరేగింపు నిర్వహించి నైవేధ్యాలు సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, మూగ జీవాలు ఎలాంటి అనారోగ్యాలకు గురి కాకుండా ప్రతి యేట నవంబరు చివరి వారంలో ఈ బోనాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సిరికొండలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


అంకాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వక్రీడాకారులు

సిరికొండ నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): సిరి కొండ హైస్కూల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని చేస్తున్న వృ త్తుల వివరాలను, మనుస్సులోని భావాలను ఆత్మీ యంగా పంచుకుని సంబరపడ్డారు. 2005- 2006 పదోతరగతి బ్యాచ్ విద్యా ర్థులు తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులతో కలిసి ఒకరి నొ కరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎక్కడె క్కడో ఉన్న వారందరు ఆదివారం సిరికొండకు వచ్చి గురువుల సమక్షంలో తామే ఏవృత్తుల్లో స్థిర పడ్డ విషయాలను తెలుపుకున్నారు.భవిష్యత్తులో తమ బ్యాచ్ విద్యార్థుల తరపున చదువుకున్న పాఠశా లకు గాని తమ బ్యాచ్‌కు చెందిన సహచరవి హా చరలకు ఒకరికొకరం సహకరించుకుందా మని నిర్ణయించారు. ఉపాధ్యా యులు, మోహన్ రెడ్డి, కాశీదాస్, సురేష్‌బాబు, తదితరులు పిల్లలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం అంకా పూర్ గ్రామంలో ఆదివారం పూర్వక్రీడాకారులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన క్రీడాకారులు 30ఏళ్ళ క్రితం వస్తాద్ క్లబ్ ఏర్పాటు చేసి క్రీడల్లో పాల్గొనడంతో పాటు టోర్నమెంట్‌లు నిర్వహిం చేవారు.ఆర్మూర్ హాకీ క్రీడకు పుట్టినిల్లుగా పేరు గాం చింది. హాకీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలలో పాల్గొని ఛాంపియన్‌లుగా నిలిచారు. ఈ కార్యక్ర మంలో క్లబ్ వ్యవస్థాపక అధ్య క్షుడు జై రాజ్, అమర్‌నాథ్, పృధ్వీరాజ్, సానిటరీ రాజు, జీవి. నర్సింహరెడ్డి, వెంకట్రాం రెడ్డి, లక్ష్మీనారా యణ, కంచెట్టి గంగా ధర్, మారుతిరెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, విజయ్, ప్రవీన్, గోపి, పాల్గొన్నారు.


రుద్రూర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోటగిరి: రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం 1993 -94 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు చేరుకుని తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు తమకు విద్యబోధన చేసిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, గంగాదర్,రుక్మిణి, స్వర్ణ కుమారి, పూర్వ విద్యార్థులు పద్మశేఖర్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.190	రూ.270	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	రూ.200	రూ.305	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.81100	రూ.74800	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 3.30, 7.00, 10.30)
స్క్రీన్-2 : మెకానిక్ రాకీ (11.45, 3.00, 6.15, 9.30)
స్క్రీన్-3 : మందిర (10.45)
: కనక మహాలక్ష్మి (1.30)
: క (4.00)
: జీబ్రా (7.15, 10.40)
స్క్రీన్-4 : లక్కీ భాస్కర్ (1.00, 7.05)
: దేవకినందన వసుదేవ (4.15, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మెకానిక్ రాకీ (10.30, 10.20)
: లక్కీ భాస్కర్ (1.30, 4.30)
: దేవకినందన వసుదేవ (7.30)
స్క్రీన్-3 : అమరన్ (10.20, 7.30, 10.30)
: జీబ్రా (1.30)
: మెకానిక్ రాకీ (4.30)



దేవి : మెకానిక్ రాకీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కంగువా (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్: దేవకినందన వసుదేవ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్